త్రిపుట

ఎండ మండిపోతున్నది. గాలి గోలగా వీస్తున్నది. బజారు బేజారెత్తి కలవరిస్తున్నది. కేరళం సరళంగా నడిచి—ఛరాలున ఆగిపోయ్యాడు. చొక్కాగుండీలు విప్పాడు. జుట్టు సరిచేసుకొన్నాడు. ముఖంమీదినుండి కారుతున్న చెమటను పెదిమలతో చప్పరించాడు. ఉప్పగా తగిలింది. ఉమ్మలించి రోడ్డుమీద వూశాడు.

"ఎందుకొచ్చాను? నే నెందుకొచ్చాను. ఎవరికోసం ఎవరు పంపితే వొచ్చాను?"

ఈ సందేహం కేరళాన్ని బాధించింది. ఎంత ఆలోచించినా అతనికి తోచ లేదు. పెదిమ కొరుక్కున్నాడు. గోళ్లు గిల్లుకొన్నాడు. పెరిగినమీసాన్ని పంటిక్రిందకి లాక్కున్నాడు. దభీమని కాలితో నేలనుతన్ని ముందుకు నడిచాడు.

"ఓహోహో! తెలిసింది, తెలిసింది. అవును, ఒకరు పంపితే కేరళం ఎప్పుడూ రాడు. వాడికి తోచాలి; ఏనాటికైనా సరే! పరాయివాళ్ళ మాటలు విని చెడిపోయేటంత అల్పుడు గాడు కేరళం."

ఎదురుగా హోటలు కనిపించింది. అందులోకి చాలా మంది పోతున్నారు. చాలామంది తింటున్నారు. చాలామంది తిని వొస్తున్నారు. కేరళం ఉలిక్కిపడ్డాడు. అతన్ని ఏదో జ్ఞాపకం అంటబొడిచింది. మనిషి నీరసించిపొయ్యాడు—

"అబ్బా!" అన్నాడు కేరళం.

ఎవరూ పలకలేదు.

"అయ్యో!" అన్నాడు కేరళం.

ఒకరూ అతనివేపు చూడలేదు.

"ఆకలి-!" అని అరిచాడు.

ఒక పంది బురదవంటితో అతన్ని రాచుకుపోయింది. ఒక కుక్క అతని కాళ్లు వాసనచూసి "కుయ్" మంటూ రెండుసార్లు చుట్టూతిరిగి పరుగెత్తింది. కేరళానికి ఆకలవుతున్నది. అతను నిన్న మధ్యాన్నంనుండీ అన్నం తినలేదు. కడుపులో కొలిమిరగులుతూవుంది.కళ్ళల్లోనీడలువికారంగాకలవరించాయి.

తూలుకొంటూ హోటల్లో కెళ్లాడు. ఆకలి తీరిందాకా తిన్నాడు. సర్వరు మొదటినుండీ ఇతన్ని అనుమానిస్తూనే వున్నాడు. అప్పుడే తన సందేహాన్ని బైటపెడదామను కున్నాడు. ఐనా ఏ పుట్టలో ఏ పామున్నదో ననుకున్నాడు. కానీ ఏ పుట్టలో ఏ పామూ లేదు. కేరళం కాష్ బల్లదగ్గర కొచ్చాడు. బిల్లు టేబిల్ మీాదపెట్టి తుపుక్కున నవ్వాడు,

"గొడ్డు వెధవ. ఎంతలావున్నాడు! జుట్టువూడి బట్టతల అయింది వెధవకు"

"తంతాను. ఎముకలు విరగ్గొడతాను. అరేయ్ వేలా యుధం, నటేశన్, అప్పాసామిా, రండిరా! వీణ్ని పట్టుకోండి' అని కుర్చీలో కూచున్న లావుపాటి హోటల్ ఖామందు అరి చాడు. అతను పిప్పళ్ళబస్తాలాగా, అమెరికా పందిలాగా వున్నాడు. గుండ్రంగా ముందుకుసాగిన పొట్ట రొప్పువల్ల పైకీ కిందికీ కదులుతున్నది. నలుగురుమనుష్యులు వొచ్చి కేరళాన్ని పట్టుకున్నారు.

కేరళం జడుసుకొన్నాడు. బిత్తరపోయ్యాడు.

"ఏమి టిది? ఎందుకు నన్ను పట్టుకొన్నారు? నాదగ్గిర చిల్లిదమ్మిడీకూడా లేదు; మా ఆవిడమాట వినకుండా, ప్రొద్దుగూకినతరవాత ప్రయాణం చెయ్యటం నాదే పొరబాటు! హా ప్రేయసీ! నీ మాట వినకుండా, తలబిరుసుగా వొచ్చి నందుకు నాకు తగినపరాభవమొంది — ఈ అర్ధాన్నపు టడవి లో కనుచీకటిచాటుగా నలుగురు దొంగలు నన్ను పట్టు కున్నారు. అయ్యలారా! నాదగ్గిర 'కాసీ' గూడా లేదు. నే నబద్ధమాడటంలేదు. చిన్నప్పుడు—"అబ్దుల్ ఖాదరూ—నలు గురు దొంగలు" పాఠం నే నింకా మరచిపోలేదు. నన్ను— నన్ను విడిచిపెట్టండి. భగవంతుడు మీకు ఆయురారోగ్యైశ్వ ర్యాభివృద్ధుల ననుగ్రహించు గాక..."

కేరళం ఇట్లా మాట్లాడుతూ నేవున్నాడు. ఫెడీ ఫెడీమని ఆ హోటలుఖామందు కేరళంమొఖంమీద కొట్టాడు. కేరళం వెనక్కు తూలాడు. సెర్వర్లు ముందుకునెట్టారు. ఖామందు పక్కకు తోశాడు. కేరళం మండిగానికి కాలుతగిలి, తూలి, ముందుకు దూకి పడబోయి, నిలబడ్డాడు. అప్పటికి చాలామంది చుట్టూమూగారు. కేరళం వాళ్ళను పరకాయించి చూశాడు. ఆతనికిఎక్కడనుండో కొత్త ఉత్సాహం ఎంత ఆపినా ఆగ కుండా పొడుచుకొచ్చింది—:

"సోదరులారా! పరమేశ్వరుని భక్తులారా!! అందరూ నిశ్శబ్దంగా కూచోండి. లేకపోతే షెర్లీ టెంపుల్ స్టేజీమీదకి రావటానికి అంగీకరించదు. క్రిందటిరాత్రి షెర్లీ టెంపులూ, నేనూ కలిసి కంపోజ్ చేసిన కొత్తగేయనాటకను ఇక్కడ ప్రద

ర్శించబోతున్నాం. దయచేసి అందరూ కూర్చోవాలి" అని అరిచాడు. చుట్టూవున్న జనం ఫక్కుమని నవ్వారు. చిన్న పిల్లలు "హేయ్—హేయ్" అని చప్పట్లు కొట్టారు.

"నవ్వండి. నా బతుకు... చివరికి నవ్వులపాలైంది. మీరే కాదు—నేను చేసుకొన్న భార్యకూడా నన్ను చూసి నవ్వుతుంది. అట్లా నవ్వినప్పుడు నాకు కోపం మండిపోతుంది. ఆ నవ్వే పెదిమల్ని పటకారుతో పట్టుకొని మెలిపెడదామని పిస్తుంది. కానీ దగ్గిరికివెడితే నాకోపమంతా పొగలాగా తేలి పోతుంది. మీరు చూశారో లేదో-నాభార్య మహాచక్కనిది. పచ్చగా సన్నగా వుంటుంది. నల్లనిజుట్టు, చిన్ననోరు, గులాబి రేకుల్లాంటి పెదిమలు—ఏమిటిది— ఎందుకు నవ్వుతారు?... పూర్వకవి ఏమన్నాడంటే "నక్కకు, కుక్కకు, చుక్కకు, వక్కకు, పక్కలకు... ఓంశంభో! ఓంశంభో! ఇంతటిలో ఈ కార్యక్రమం ముగిసింది. ద్వితీయప్రసారం మూడు గంటల నలభై ఎనిమిది నిమిషాలకు—పదహారు పాయింట్ ఆరు ఒకటి తొమ్మిదీ మీటర్ల మీద వినవచ్చు..."

అని కేరళం రెండుచేతులూ చాపి, అల్లాబిల్లీ తిరుగు తున్నాడు. పక్కగా ఎలక్ట్రిక్ స్తంభానికి ఉడత పాకుతున్నది. కేరళం రెండుచేతులూ గుప్పిళ్ళు ముడిచి ఒకదానికొకటి రాచుకుంటూ "ఉడతా ఉడతా ఊచ్-సన్నబియ్యం సాక్షి" అని పాడుతూ, పాటకు సరిపోయేటట్లు, కాళ్ళతో దరువు తొక్కాడు. ఈ గలభావల్ల ట్రాఫిక్ ఆగిపోయింది. గుంపుకు ఆ చివరా, ఈ చివరా చాలాగుర్రబ్బళ్ళు, రిక్షాలు. సైకిళ్ళు... ఆగిపోయినై. అంతలోకే వెనక ఉన్న కారు హారన్ కొట్టింది.

జనం ఒకరిమీద మరొకరు తోసుకుని దోవయిచ్చారు. కారు మెల్లిగా నడుస్తున్నది. కేరళం కారుదగ్గరికి పరుగెత్తాడు. కమాన్‌ను పట్టుకొన్నాడు. కాస్తదూరం కారుతోబాటు పరుగెత్తి తరవాత వొక్క దూకుతో వెనక కూచున్నాడు. శరవేగంతో (!!) కారుపోతోంది...

కారు ఆగింది. కారుతో బాటే కేరళం కూడాఆగాడు. పొద్దు వాటాలింది. మేడల నీడలు సాగుతున్నాయి. జనం రోడ్లమీద మరీ ఎక్కువయ్యారు. అజీర్తిరోగి పేగుల్లాగా, బజార్లు బిరుసెక్కి కిటకిటలాడిపోతున్నవి. కేరళం పక్కవీధికి మళ్ళాడు. అతనికి హఠాత్తుగా వొక బ్రహ్మాండమైన ఆలోచన కలిగింది. ఈ దరిద్రంతో ఎంతకాలం తను బాధపడేట్టు? ఎన్ని రోజులు పస్తులుచేసేట్టు? ఒకసారి ఒక లప్పను లప్ప దొరికితే! తను రైల్లో పోతున్నప్పుడు - తను ఎక్కిన పెట్టె తప్ప మిగతావన్నీ పక్కకుదొర్లితే? అందరిజేబులూ, పెట్టెలూ, వెదికి డబ్బు, సొమ్ములు పోగుచేసుకోవచ్చు... ఈఆలోచనతో అతని తలకు దురదబుట్టింది. గోక్కున్నాడు. గోటిలో చిక్కుకొని ఒకవెంట్రుక వొచ్చింది. ఎగిరి గంతేశాడు—

"ఓహో! జన్మ తరియించెన్ నేటికి నాకోర్కె లీడేరెన్" అని పాడాడు.

"ఈ వెంట్రుక - అబ్బ - ఎంతకాలానికి దొరికింది! దీనికోసం సంవత్సరాలతరబడి తపస్సు చేస్తున్నాను! దీన్ని తీసికెడతాను. తులసిఆకుపసరు పోస్తాను. ఏడురోజులు పుటం వేస్తాను, అప్పుడు ఇది ''రోమభస్మం''అవుతుంది. ఆభస్మాన్ని ఏవస్తువుకు తగిలిస్తే అదల్లా బంగారమై వూరుకొంటుంది.

బంగారం! బంగారం!! అపారమైన బంగారం. అంతు లేని బంగారం. ఎటువిన్నా, ఎటుకన్నా; రంగారెడ్డి బంగారం, బంగారం సింగారం, కాలువలో కలువపువ్వు"

కేరళానికి సంతోషం ఎక్కువైంది. తన జుట్టు తనే పీక్కున్నాడు. తన బుగ్గమీద తనే చిటిక వేసుకొన్నాడు రోడ్డుప్రక్కగా నడుస్తున్నాడు.నడుస్తూనడుస్తూ ఆగిపోయ్యాడు. అక్కడ అరటితోలు పడివుంది. కేరళం దానిమీద కాలుబెట్టి జారకుండా నడిచాడు ముందుకు—

"గెలిచాను - గెలిచాను
తలచాను - వలచాను
పాచిపట్టు మరీది—
కలలోన - వలలోన
నూతిలో - గోతిలో
నాతిలో - నీతిలో
నవ్వాడు పోతన్న
రువ్వాడు అక్కన్న..."

పాడుతున్న పాట తపీమని ఆపి, కళ్ళు నులుముకొని, ముఖం చొక్కాతో తుడుచుకొని చూశాడు, కేరళం. ఒకమ్మాయి తనతో బాటే - ఐతే ఎడంగా వొస్తున్నది. ఆతని మనస్సు విప్పారింది. నరాలు కిరకిరమని సళ్లిచ్చినై. పెదిమ చప్పరించాడు కేరళం—

"ఓహ్! ఈ పిల్ల ఎంత బాగుంది! నా గుండెలను డెక్కలాగా పట్టింది. అడుగుతగిలిన పడవలాగా నామనసు ఈమెను దాటిపోవటల్లేదు, ఎంత ప్రయత్నించినప్పటికీ! దేని

కైనా అదృష్టముండాలి. తత నితంబాభోగ ధవళాంశుకము లోని అంగదట్టపు కావిరంగు నాకళ్ళను చెదరగొడుతున్నది. గురుమాపు దడిమంపు కోకంలో దోలకెడు కంపమాననితంబ కాంతి సొంపు నన్ను కదలించివేస్తున్నది. కదలించి, విదలించి, విలపించి—"

"ఏమిట్రోయ్ 'విలపించి' అంటున్నావ్? దేన్నిగురించి అది?" అన్నాడు కేశవం—వాళ్ళిద్దరూ స్నేహితులు.

కేరళం ఉలిక్కిపడ్డాడు. పడి—

"ఏమిటి?" అన్నాడు కేశవాన్ని భయంతో చూస్తూ.

"విలపించటం" అన్నాడు కేశవం.

"ఏమిటి విలపించటం?"

"ఏమో? నువ్వే అంటుంటివే!"

"ఎప్పుడు? ఎప్పుడు అన్నా నా మాట నేను? ఎవరు చెప్పారు అన్నానని?"

"నేనే స్వయంగా విన్నాను"

"ఎప్పుడు విన్నావు?" బిగ్గరిగా అరిచాడు కేరళం.

"ఇప్పుడే. చెవులతో. నీపక్కనే వుండి" అన్నాడు కేశవం.

"ఇదుగో! ఆత్మస్వరూపా!! ఒకవిషయం అడుగుతాను నిజం చెబుతావా?" అన్నాడు కేరళం ప్రాధేయపూర్వకంగా. అతనిధోరణిచూస్తే కేశవానికి జాలేసింది.

"ఏమిటి?" అన్నాడు కేశవం.

"నిజం చెప్పాలి. రుజ నెరుగని ఖనిజంవంటి నిజం కావాలి."

కేశవం నిర్విణ్ణుడయ్యాడు. కేరళం ధోరణి, వాలకమూ అతనికి ఏమాత్రం అర్థంకాలేదు. చాలాదూరంగా భయం తల నెత్తింది. అతని నొకవిధమైన ఆందోళన ఆవరించింది

"చెబుతాను. తప్పక ఒప్పే చెబుతాను. గరళకంఠుని సాక్షిగా- కేరళం, ఖనిజంవంటి నిజం చెబుతాను—" అన్నాడు కేశవం—అతన్ని అపహసిస్తో.

"నీకు—" అని కళ్ళలో నీరుతిప్పుకున్నాడు కేరళం. "నాకు తెలుసు. నువ్వు నా శ్రేయోభిలాషివి. నాతో బొంకజాలవు. నీకు - నీకు తెలుసుగదూ ?"

"ఏమిటి నాకు తెలిసింది ?"

"అదే ! అదే !!" అని రెండు చేతులతోనూ ముఖం కప్పుకొని వెక్కి-వెక్కి-ఏడ్చాడు కేరళం.

కేశవానికి అర్థంకాలేదు. ఇతని బాధ ఏమిటి ? భార్య మరణించిందా ? ప్రియురాలు తిరస్కరించిందా ? వ్యాజ్యంలో వోడిపొయ్యాడా ? ఆప్తబంధువులు స్వర్గారోహణ చేశారా ? ఇల్లు కాలిపోయిందా ? ఇవన్నీ కానేకావని కేశవానికి శుభ్రంగా తెలుసు. భార్య మరణిస్తే కేరళం సంతోషిస్తాడు. అతనికి ప్రియురాళ్ళు లేనేలేరు. అతనే ఎవరికన్నా ప్రియుడుగావుంటే వుండవొచ్చుగాక. వ్యాజ్యంలో వోడిపోదగ్గవేవీ అతనికి లేవు. బంధువులు చస్తే ఏడిచేటంతటి అవసరమూ లేదు. ఇల్లు కాలిపోయినా ఫర్వాలేదు. ఎందుకంటే అది స్వంతం కాదు. అద్దె కొంప. మరి?—మరి ? ?

"ఏది ? ఏది ? ?" అని బుజ్జగించాడు అతను. కేరళం - ఏడుపు దిగమింగి, ఉమ్మి గుటకవేసి, కళ్ళుతుడుచుకొని—

"పరకాయ ప్రవేశం—" అని ఆగి ఆశ్చర్యంగా నోరు తెరిచాడు. కను లప్పళించాడు కేరళం.

"తెలీదు."

"అబద్ధం."

"కాదు."

"నీదే కాదు."

"నీదే కాదు."

"మరి ఆమాట ఎట్లా తెలిసింది నీకు ?"

"ఏమాట ?" తలగోక్కున్నాడు కేశవం. ఎంతగో క్కున్నా - తనకు ఏమాట ఎట్లా తెలిసిందో తెలీటల్లేదు.

"అదే—'విలపించి'—" అని సిగ్గుతో తలవొంచు కొన్నాడు కేశవం.

"నువ్వే అన్నావుగదా !"

కేరళం ముఖం జావగా కరిగిపోయింది. కేశవం రెండు చేతులూ పట్టుకొని గుండెల కానించుకొన్నాడు కేరళం.

"త్రిమూర్తుల సాక్షిగా, నాలుగు వేదాల సాక్షిగా, పంచభూతాల సాక్షిగా చెబుతున్నాను. ఆమాట నేననలేదు. ముమ్మాటికీ అనలేదు. నామాట నమ్ము కేశవం."

కేశవానికి ఇదంతా అగమ్యంగా వుంది. విసుగెత్తింది.

"సరే—వొస్తాను మరి. అవతల చాలాపనులున్నాయి" అని చరచరా నడక సాగించాడు కేశవం.

"అమ్మయ్య! ప్రాణం ఒడ్డుపట్టింది. జిడ్డువెధవ. ఎంతకీ వొదిలాడుగాదు. కేశవమంట కేశవం—వీణ్ని కేశవ మనటం కంటే, 'శవం' అనటం మంచిది.

కేరళం భుజంఅదిరిపోయింది ఆ లాగుడుతో. ముందుకు పోతున్న కేశవం పైమాటలు విని, వెనక్కి వొచ్చి అతని భుజం పట్టుకు గుంజాడు గుంజి—

"ఒంటికి మదమెక్కి ఏడవబోకురోయ్ కేరళం! చర్మం వొలిపించగలను. బుర్రదగ్గిరబెట్టుకొని మాట్లాడు. నన్ను కేశవం అనటంకన్న 'శవం' అనటం మంచిదా? మాట్లాడవే మిత్రా పుండాఖోర్? నోరు బిగుసుకుపోయిందేం?" అని కేకలువేశాడు కేశవం.

"ఎప్పుడన్నాను నేను?" అన్నాడు కేరళం.

ఈ పిచ్చిపిచ్చి వేషాలు మనదగ్గిర సాగవు. మంచిగా వుంటేనే మంచి. కాదో, ఓచెయ్యి చూసుకొందాం రా. నోటికి వొచ్చినట్లు పేలావంటే పళ్ళు రాలగొడతాను. జాగ్రత్త" అన్నాడు కేశవం, పిడికిలిబిగించి. కేరళంముఖంమీద ఆ పిడికిలిని గుండ్రంగా తిప్పాడు.

"ఇదుగో! వెంకటనరసయ్యా!! ఎందుకు అట్లా నోరు పారేసుకొంటావు? నే నింతవరకూ ని న్నెరగను. కాదుకాదు, నిన్నెరుగుదును.కానీ,నీకొట్లో చిల్లిదమ్మిడీ వెచ్చంగూడా నేను వాడలేదు. నా భార్య వాడిం దంటావా? అది దానితప్పు. రేపు వెళ్ళి దాన్ని దబాయించు. నీ యిష్టమొచ్చినట్లుతిట్టు. నడిబజార్లో నిలవేసి నీడబ్బు అణా పైసలతో పుచ్చుకో. నేను కాదనను. నా భార్యచేసిన అప్పుకు నన్ను నిలవెయ్యటం భావ్యమేనా వెంకటనరసయ్యా? భగవంతుడు ఈ పనికి మెచ్చుతాడా?" అన్నాడు కేరళం.

"దొంగవెధవ! అన్నీ వేషాలు వేస్తున్నావు. వేషాలయినా ఒళ్లు దగ్గరుంచుకొని ప్రవర్తించు. లేకపోతే పోలీసులదాకా వెళ్ళవలసివొస్తుంది" అన్నాడు కేశవం.

ఆమాట వినగానే కేరళం మలేరియారోగిలాగా వొణికాడు. నీళ్ళలో తడిసిన పిట్టలాగా కుంచుకొనిపొయ్యాడు. అమాంతం కేశవం రెండుకాళ్ళూ పట్టుకొన్నాడు.

"క్షమించు పరాత్పరా! నీ మాహాత్మ్యం తెలియక మొన్నరాత్రి నీగుళ్ళో చుట్టకాల్చాను. అపరాధం అపరాధం! మన్నించండి. ఇక జీవితంలో, ఎప్పుడూ - దేవాలయంలో చుట్టకాల్చను. ఈపాపపరిహారార్థం రెండురోజులపాటు నీగుళ్లో నీపాదాలదగ్గిర పడుకుంటాను. క్షమించండి. మీ రా మాట అన్నదాకా నేను మీపాదాలను వదలను."

కేరళం, పట్టపగలు, రోడ్డుమీద మోకరించివుండటం చూచి, చుట్టుపక్కలవారు చుట్టూచేరారు.

''ఏయ్! ఎవరు నువ్వు? లే లే లే'' అన్నారు. కేరళం లేచాడు.చుట్టూజనాన్ని చూశాడు. ఏదో గ్రహించినవాడులాగా కుడిచేయి చూపుడువ్రేలు నోట్లో పెట్టుకొని పెద్దగాఅరిచాడు.

''పిచ్చి—పిచ్చి" అన్నారు ఎవరో. "మీ దెవసం - పోలీసు లొస్తున్నారు. పోలీసులు పోలీసులు. పొండి పొండి. తొరతొరగా పరుగెత్తండి. దాక్కోండి" అంటూ కేరళం పరుగు లంకించుకొన్నాడు. విపరీతమయిన వేగంతో పరుగెత్తు తున్నాడు. రోడ్డు వెనక్కు జారుతున్నది. చెట్లు, ఇళ్ళు, స్తంభాలు బిత్తరపోతున్నాయి అతన్ని చూసి. కానీ అతను మాత్రం ఎటువేపూ చూడటంలేదు.

ఊడిపోతున్న పంచను ఎగదోపుకొంటున్నాడు. కారుతున్న చెమటను తుడుచుకొంటున్నాడు. అడ్డంపడుతున్న క్రాపును సరిచేసుకొంటున్నాడు—చాలాదూరం పరుగెత్తాడు విపరీతంగాఆయాసం వచ్చింది. డొక్కలు ఎగిరిపడుతున్నాయి. ఊపిరిపీల్చడమే కష్టమయిపోయింది. ఇక నడవలేకపొయ్యాడు. కాళ్ళు కండెలు గట్టాయి. ఒక ఇంటి వసారాలోకి జేరుకున్నాడు.

"అమ్మయ్య! ఇవ్వాళ ప్రొద్దునలేచి ఎవరిముఖం చూశానోగానీ, అదృష్టవంతుణ్ణి. లేకపోతే ఆ పూనమ్‌చంద్‌గాడు ఒక పట్టాన వొదిలి పెడతాడా? అప్పటికీ శాయశక్తులా పోరుకులాడుతూనే వున్నాను. ఎక్కడి డబ్బూ తిండికే చాలటంలేదు. ఇంక బాకీ లేమి దీర్చను? చెల్లించినడబ్బు వడ్డీక్రింద జమబడుతుంటే-అసలు, అసలుగానే వుండిపోతున్నది. ఐనా, ఆ వెధవకంటపడకుండా, సాధ్యమైనంతవరకూ తప్పించుకొని తిరుగుతునే వున్నాను. హఠాత్తుగా సినిమాహాలుముందు తారసిల్లాడు. కంట్లో దుమ్ముకొమ్మి పరుగెత్తుకొచ్చాను. లేకపోతే, తాటితో కాలికి కట్టేసుకొనేవాడు— ఆహా! ఈగాలి ఎంత చల్లగావున్నదీ! ఇదేమిటి!! నా గుడ్డలన్నీ ముద్దముద్దగా తడిసిపోయిన య్యేమిటీ?"

అని కేరళం వసారాలోంచి ముందుకు చూచాడు. జోరుగా వాన కురుస్తున్నది. కనుచీకటి పడ్డది. ప్రయత్నపూర్వకంగా తప్ప, మనిషిముఖం కనిపించటంలేదు. కేరళం చొక్కా విడిచి పిండుకొన్నాడు. దానితోనే తలతుడుచుకొన్నాడు. కట్టుగుడ్డనిండా బురదచింది ఆలుగుడ్డలాగా తయారైంది. క్షణక్షణా

నికి గాలి హెచ్చుతున్నది. గాలితీవ్రతకు చినుకులు వసారాలో ప్రవేశిస్తున్నాయి. అతను గడగడ వొణుకుతున్నాడు. ఇక్కడ వుండటం ప్రమాదమని గ్రహించాడు. వాన వెలిసిందాకా ఈ యింట్లో తలదాచుకోవటం మంచి దనుకొన్నాడు. అనుకొని మెల్లిగా తలుపుతట్టాడు.

"ఎవరండీ?"

"నేను—నేను—" అన్నాడు కేరళం.

"ఆ దిక్కుమాలిన సినిమాల కెళ్ళొద్దండీ అని మీ కెన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు. పెడసరంగా వెళ్ళారు. వెళ్ళి ముద్దముద్దగా తడిసొచ్చారు. ఇందాకనే నామాట విన్న ట్లయితే ఈ గిజాటంతా లేకుండాపోనుగదా! నామాటంటేనే మీకు తుస్కారమాయె, ఎందు కింటారూ?..."

తలుపులు తెరుచుకున్నాయి. హోరుగాలి జిమ్ముమని కేరళాన్ని లోపలికి నెట్టింది.

"ఓహ్‌! ఎవరండీ మీరు?" అన్నది ఆమె కేరళాన్ని చూసి చకితురాలై. ఇంతవరకూ ఆమె, ఆ వొచ్చినవ్యక్తి తన భర్త అనుకొంటున్నది. అట్లా అనుకొనబట్టే—ఆమాటలన్ని అన్నది. తీరా చూస్తే కాకుండాపొయ్యాడు. అందుకే ఆమె రవంత సిగ్గుపడి, రవంత నవ్వి, క్రిందిపెదిమ కరుచుకొన్నది.

"మాది పొరుగూరండీ! ఊళ్లో కెళ్ళకముందే వాన వొచ్చింది. కాస్త వెలిసిందాకా నుంచోనివ్వండి. మీకు పుణ్య ముంటుంది" అన్నాడు కేరళం.

ఆమె లోపలకెళ్లి దీపంతెచ్చింది. ఇంటికి మధ్యగా ముక్కాలుపీట వేసి దీపం దానిమీద పెట్టింది. దీపం, పీటమీద

పెట్టటానికి వొంగినపుడు, ఆమె మెళ్లోనగలు జిగజిగమని మెరిశాయి. పమిట కిందికి జారింది. జడ కుడిభుజంమీదుగా నేలను తాకింది. కేరళం చూశాడు. గాఢంగా నిట్టూర్పు విడిచాడు. రెండుచేతులతోనూ గుండెను గట్టిగా పట్టుకొన్నాడు. కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. కానీ, ఫోటోతీసిన అతనికళ్లు, ఆమె రూపాన్ని మనస్సులోకి నెట్టాయి. కేరళం ఆముతిన్న గొడ్డులాగా గిజగిజలాడాడు.

"ఈనాడు నాజన్మ సార్థకమయింది. నేను జన్మాంతరాలనుండి అన్వేషిస్తున్న స్వప్నసుందరి ఇక్కడ సాక్షాత్కరించింది. నిండారిన ఈ యవ్వనం, అపురూపమైన ఈ సౌందర్యం, ప్రతిరోజూ పుష్కలంగా అనుభవించే ఈమె భర్త ఏనాడు ఏపుణ్యాం చేశాడో, ఏగంధర్వులు కరుణించి ఈతనికీ అందాలకాణాచిని ప్రసాదించారో తెలీదు. జన్మమంటే అతనిదే జన్మం. మిగతావన్నీ వొట్టి..."

"నోర్ముయ్. పెదిమ కదిపావంటే చెప్పు వెదకాలి పోస్తుంది..." అన్నది ఆమె. కేరళం ఆమెవేపు చూశాడు. ఆమెముఖం ఎర్రబడ్డది కళ్ళల్లో కొద్దిగా—భయపు తెరల వెనుక నీరు గ్రమ్మింది. బూచిమాట విన్న పసిపాపలాగా వొణుకుతున్నది.

"ఏమిటండీ అట్లా అంటున్నారు? మీ రెవర్ని అంటున్నారో నాకు అర్థంకావటంలేదు. ఇక్కడ మీరు, నేనూదప్ప ఇం కెవరూ లేరుగదా! మీ రీ మాటలన్నీ ఎవరిని అన్నట్లు" అన్నాడు కేరళం ఇంటినాలుగుమూలలూ పరకాయించి చూస్తో.

"ఇంకెవరన్నావుంటే, నీవీపు ఈపాటికే పెట్టివుండేది. ముందు బైటికి నడువ్. లేకపోతే పెద్దగా అరుస్తాను" అన్నదామె బిగ్గరగా. ఆశబ్దం బైట వానతీవ్రతలో మారుమోగింది.

కేరళం బెదిరినగొడ్డులాగా మిర్రిమిర్రి ఆమెవేపు చూశాడు.

"అట్లా చూస్తావేం? నీకే చెప్పేది. ముందు బైటికి నడువు—వానలో తడిసిపోతున్నావుగదా అని లోపలకు రానిచ్చినందుకు- ఇదిట్రా నువ్వు చేసేపని?"

"ఏమిటితల్లీ! నే నేంచేశాను?"అన్నాడు కేరళం రెండు చేతులూ జోడించి.

"ఈవేషాలు నాదగ్గిర చాలించు. ఈనాడు నీజన్మ సార్థకమయిందా? నేను నీ స్వప్నసుందరినా? ఈయవ్వనం... అనుభవించే అదృష్టం...నీకు నో రెట్లా వచ్చింది? నీకు అక్కలూ, చెల్లెళ్ళూ లేరూ? వాళ్ళఅందం ప్రతిరోజూ అనుభవించేవాళ్ళు-వా ళ్ళెంతటి అదృష్టవంతులు?తొరగా బైటికి నడు. కాసేపువుంటే వారొస్తారు. అప్పుడు నీజన్మ నిజంగానే సార్థకమవుతుంది" అన్న దామె.

"నేను—నే నా మాట అనలేదండీ! అమ్మతోడండీ! ఏవొట్టుబడితే ఆవొట్టు వేసుకొంటానండీ" అన్నాడు కేరళం ఏడుస్తూ.

ఆమె నవ్వింది. ఏనా ఆ నవ్వులో పిరికితనం ప్రతిఫలిస్తూనేవుంది. ఇక అతన్ని నమ్మటం ఆమెశ క్తికి మించినపని- ధైర్యం తెచ్చుకోవటంకోసరం ఆమె దగ్గింది. దగ్గి-

"ముందు బైటికి వెళ్ళు. లేదా నేనే గెంటవలసివొస్తుంది" అన్నది.

"లేదు, లేదు. నే నామాట అనలేదు" అని మూలిగాడు కేరళం.

"అన్నావు-అబద్ధమాడబోకు."

మరుక్షణంలో తలుపు తెరుచుకొని - బోనునుండి తప్పించుకొన్న మృగంలాగా కేరళం వీధిలోకి దూకి, పరుగు ప్రారంభించాడు.

అతను ఇంటికి చేరుకొనేటప్పటికి రాత్రి చాలా ప్రొద్దు పోయింది. ఐనా భార్య అతనికోసం ఇంకా మేలుకొనే వున్నది.

"ఇప్పటిదాకా ఏం చేస్తున్నారండీ?" అన్నది భార్య కేరళం ఇంట్లోకి రాగానే.

"చిత్రం. ఆలస్యమయిందండి. ఇంటిదగ్గిర ఆడవాళ్ళుతల వాకిటున్నారండీ. అందుతో మాకు పెద్దదిక్కంటూ లేనే లేదండీ. అంచేత, నాలుగుమెతుకులు ఉడకేసేటప్పటికి ఆలస్య మయినమాట నిజమేనండీ! ఇంకెప్పుడూ ఇంతలేటుగా ఆఫీసుకు రానండీ!!" అన్నాడు కేరళం కొంచెం ముందుకు వొంగి, చేతులు నులుముకొంటూ.

ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. భర్త చూడకుండా పమిటతో వొత్తుకున్నది.

"లేవండి. ఇప్పటికే చాలా ప్రొద్దుపోయింది. ఆ తడి గుడ్డలు విప్పి, మూలపడెయ్యండి. ఈలోపుగా నీళ్ళు తోడతాను. స్నానం చేద్దురుగాని..."

స్నానంచేసి, భోజనానికి కూచున్నాడు కేరళం. భార్య వడ్డించింది. ఒకసారి పదార్థాలవేపు, ఇంకోసారి భార్యవేపూ చూశాడు కేరళం. అతనికి గొప్ప సంతోషమేసింది. ఉదయం నుండీ అతనికి అన్నంలేదు. ఆకలితో కనకనలాడిపోతున్నాడు. అన్నం చూడగానే అతని ఆకలి మరింత విజృంభించింది. గబ గబ తింటున్నాడు. అట్లా తినటంలోనే ఒకసారి కొలమారింది. నాలుగైదు నిమిషాలు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఈవిధంగా నన్ను హింసపెట్టకపోతే ఒకసారే ఏ మందోమాకో పెట్టి నన్ను చంపరాదుటే, ఫీడా వొదిలి పోతానుగా!" అన్నాడు కేరళం, అన్నంతినటం ఆపి, భార్య ముఖంలోకి చూస్తూ.

"ఏమిటండీ" అన్నది భార్య ఉలిక్కిపడి.

"నీనటన నాకు తెలుసు. నువ్వు చదువుకొని సంపాదించిన విజ్ఞానమంతా నీభర్తను హింసించటంలో ఉపయోగ పెడుతున్నావు. పైకి నువ్వుచేసిన లేక చేస్తున్న ప్రతిపనీ బాగానేఉంటుంది, కానీ, ఆపనులిచ్చే ఫలితాలు దారుణంగా భయంకరంగా వుంటాయి. ఎంతో మేధావంతులైతేగాని నీ పనులవెనక పేరుకుపోయిన ఆ కల్మషాన్ని కనుక్కోలేరు" అన్నాడు కేరళం.

భార్య దిగాలుపడ్డది. "ఏం జరిగిందో చెప్పండి. ఒక వేళ పొరబాటున——" అంటున్నది. మధ్యలోనే-

"కాదు" అన్నాడు కేరళం- "ఇది పొరబాటుకాదు. బుద్ధిపూర్వకంగా నువ్వు కావాలనే చేస్తున్నావు. నేను బ్రతకటం నీకిష్టంలేదు. అందుకే నన్ను చంపటానికి నువ్వు వివిధో

పాయాలను పన్నుతున్నావు- కాదని బూకరించబోకు. కావాలంటే ఇప్పుడే నీకు సాక్ష్యం చూపెడతాను.

ఆమె మాట్లాడలేదు.

"ఈ పచ్చడి ఇంత రుచిగా ఎందుకుచేశావో నాకు తెలుసు" అన్నాడు కేరళం పకపకనవ్వి.

"పచ్చడి రుచిగా చేయటంగూడా తప్పేనటండీ?" అన్నది భార్య.

"పై చూపులకు గాదు. కానీ ఆలోచిస్తే-ఇందులోనే నామృత్యురహస్యం ఇమిడివున్నది నేను ఉదయంనుండీ తిండి తినలేదని నీకు తెలుసు. ఎక్కడా తినలేదని గూడా తెలుసు. ఇంటికొచ్చేసరికి ఆవురావురుమంటూంటానని గ్రహించి, ఈ రుచిగల పచ్చడి చేశావు. అసలే ఆకలిగా వున్నవాణ్ని, పైగా రుచిగల పచ్చడి, తొరతొరగా తింటాను. కొలమారుతుంది. అదృష్టవశాత్తూ ఆసందడిలో చనిపోతే, నీ శని వొదులుతుంది. అంతేగదూ?" అన్నాడు కేరళం కోపంగా.

ఆమెకు ఎంత అణుచుకొందామన్నా దుఃఖమాగింది కాదు రెండు చేతులూ ముఖానికి కప్పుకొని ఇంట్లోకెళ్ళింది. ఈ విధమైన నరకపుకోతను ఆమె కొంతకాలంనుండి అనుభవిస్తున్నది. ఈ చీకటిగుహనుండి బెటపడే మార్గమేమీ కనుపించటంలేదు. తొలిరోజుల్లో—తీయతీయని కలలు కన్నది. ఆ కలలన్నీ చేదుమేసి దుర్భరరూపం దాల్చాయి ఈనాడు.

"అమ్మాయ్యో! రండిరండి! ! నా భార్య నన్ను చంపుతున్నది. బలవంతాన నాగొంతు కోస్తున్నది. అయ్యలారా! అమ్మలారా!! మరుజన్మలో మీ బిడ్డనయి జన్మిస్తాను.

నా భార్యనుండి నన్ను రక్షించండి'' అని కేకలు పెడుతున్నాడు కేరళం.

భార్య యింట్లోనుండి గబగబా పరుగెత్తుకొచ్చింది.

''ఆగు రాక్షసీ! అక్కడే ఆగు!! ఒక్కఅడుగు ముందుకు వేశావంటే నేను గొంతు నులుముకొని చచ్చిపోతాను" అని గొంతుమీద చేతులు పెట్టుకొన్నాడు కేరళం. ''నాకు తెలుసు. నన్ను చంపటానికి నువ్వింట్లో కెళ్ళావు. కొలమారి చనిపోతాడని ముందుగా ఊహించావు. అదితప్పిపోయేసరికి— ఇస్—ఏడవబోకు—తప్పిపోయేసరికి, గొంతుకోద్దామని కొడవలికోసం ఇంట్లో కెళ్ళావు. లేకపోతే ఆడదానికి వంటింటిలో పనేముంటుందో నాకు చెప్పు? చెప్పవేం? గొడ్డులాగా నిలబడతావేం?"

భార్య కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నది. కేరళం భార్యవేపు చూశాడు. మెల్లిగా దగ్గరికొచ్చాడు. కుడిచెయ్యి గడ్డంక్రింద వేసి ముఖం కొంచెంగా పైకెత్తాడు. ఎడమచేత్తో రేగినజుట్టు సరిచేశాడు. ఆతని కళ్ళల్లోగూడా నీళ్ళు తిరిగాయి.

''ఊరుకోవే పిచ్చిదానా! ఏడ్చి ఎవర్ని సాధిస్తావు? ఇవ్వాళ వాళ్ళకు కట్టుకుపోయినంత వుంది. అందుకనే ప్రతివారినీ చులకనగా చూస్తారు. అదృష్టంబాగుంటే ప్రస్తుతం నేను చేస్తున్న ఓడవ్యాపారంలో రెండులక్షలు లాభించవొచ్చు. ఆరోజున ఇటువంటి వెధవలను నీ పాదదాసీలుగా ఏర్పాటు చేస్తాను. ఏడవబోకు. చూడు. నీ కళ్ళు ఎట్లా ఎర్రబడ్డాయో" అని భార్యను ఓదార్చాడు కేరళం.

ఆమె లేచి భర్తకు ప్రక్క అమర్చింది. అతన్ని దాని మీద పడుకోబెట్టింది. పాతగుడ్డలు మడతబెట్టి మెడవరకూ కప్పింది. మెల్లిగా చిచ్చికొట్ట నారంభించింది.

"అమ్మా," అన్నాడు కేరళం మెల్లగా భార్యచెయ్యి బట్టుకొని.

ఆమె దిగులును దిగమింగి "ఊఁ" అన్నది బలవంతాన

"రేపు నేను బళ్ళోకి పోనమ్మా! సీతయ్యమేష్టారు పొద్దున గోడకుర్చీ వేయించాడమ్మా!...... నడుములన్నీ పీక్కుపోయినై. 'పులి- బ్రాహ్మణుడు' పాఠమున్నూ, 'గంగ పారుచుండు' పద్యమూ నోటకొచ్చేట్లు చదవమంటే ఎట్లా వొస్తుందో నువు చెప్పవే అమ్మా, "మా అబ్బాయికి పాఠం రాకపోయినా కొట్టవద్దు" అని రేపు పలకమీద రాసిపెట్టవు టే అమ్మా ఇంకెప్పుడూ! నిన్ను కాసిలకోసం ఏడిపించనుగా. ఏం? చెప్పవేం?" అన్నాడు కేరళం.

భార్య మాట్లాడలేదు. బరువుగా నిట్టూర్చింది. పూర్వ కాలమైతే ఆ నిశ్వాసాగ్నికి ఆప్రాంతమంతా బూడిదయి పోయేది. ఆమె తలుపు దగ్గిరగాలాగి, దీపం తగ్గించి, వంటింటి గడపదగ్గిర చెంగుపరుచుకొని పడుకొన్నది.

మరో అరగంటకల్లా కేరళం ఆమెను సమీపించాడు.

"ఏమిటండీ?" అన్నది భార్య.

"ఇస్. వెర్రిమొఖందానా, బిగ్గరగా అరవబోకు" అని ముక్కుమీద వేలు వేసుకొన్నాడు కేరళం. "నీ కొక మహా

రహస్యం చెబుతున్నాను. ఇది ఎవరికీ చెప్పబోకు. చెప్పావంటే నీ ప్రాణమూ, నాప్రాణమూ రఫీమని ఎగిరిపోవటం ఖాయం. నే నిప్పుడే అతన్ని చంపివొస్తున్నాను...''

"ఎవర్ని?" అన్నది భయంతో ఆమె. కేరళం ఆమె నోరు మూశాడు.

"అందుకే ఈ ఆడజాతికి ఏవిషయమూ చెప్పగూడదంటారు- వాణ్నే- ఆ రావుబహదూర్ రంగనాథంగాణ్నే. మెల్లిగా, వెనకవేపునుండి లోపలకు ప్రవేశించాను. అందరూ నిద్రలు పోయిందాకా, ఆ దానిమ్మచెట్లో దాక్కున్నాను. బహుజాగ్రత్తగా, అడుగులో అడుగు వేసుకొంటూ, రంగనాథంగాడిగది చేరుకున్నాను. గాడిదకొడుకు తాళంచెవులు దిండుకింద బెట్టుకొన్నాడు. అమాంతం ఎగిరి వాడిగుండెలమీద కూచున్నాను. కిక్కురుమనకుండా కసకసకస గొంతు నులిమి పారేశాను. భోషాణంలో కట్టలుకట్టలు నోట్లు, చిత్తుచిత్తుగా పడివున్నాయి. బంగారమూ, నోట్లూ మూటగట్టుకొని వొస్తుంటే వెధవది చీకటాయె — అప్పటికీ జాగ్రత్తగానే వొస్తున్నా — ఏతేనేం? వాకిట్లో ఫ్యాన్‌ను తొక్కాను. వాడు అరిచేలోపుగానే కత్తిసి గొంతులోకి దింపి, ఇటూ అటూ నెరిమి దాడు తీశాను - ఇవిగో! ఈ నోట్లు, బంగారమూ జాగ్రత్తగా దాచిపెట్టు. రే పొకవేళ పోలీసులొస్తే—శతవిధాల రారనుకో—వొస్తే, నేను రాత్రినుండీ కదలలేదనిమాత్రం చెప్పు; ఇంకేం అక్కర్లేదు - జాగ్రత్త! ఇక నేను వెళ్ళి పడుకొంటాను... ఇదుగో! ఎందుకైనా మంచిది, ఒకసారి నాచేతులు పరీక్ష చూడు'' అన్నాడు కేరళం చేతులు భార్యముందుకు చాపి.

"ఎందుకు? ఏమిటి చూడమంటారు?" అన్న దామె గుండె చెరువయి.

"నెత్తురుమరక లేమన్నా వున్నాయేమోనని. పోలీసులు కాలాంతకులు. ఆవలించితే పేగులు లెక్కపెడతారు" అని నీళ్ళతో కడుక్కొని, గదిలో కెళ్ళి పడుకొన్నాడు కేరళం...

—తెల్లవారింది. చాలా ప్రొద్దెక్కిందిగూడాను. ఐనా ఇంట్లో ఎవ్వరూ లేచినట్లు అలికిడిలేదు. ఇరుగుపొరుగువారు తలుపులు తట్టారు. బిగ్గరగా పిలిచారు. జవాబు రాలేదు. తలుపులు పగులగొట్టి లోపల కెళ్ళారు. అక్కడి దృశ్యంచూసి స్తంభీభూతులైనారు. కేరళం భార్య నేలమీద పడివున్నది. ఆమెగొంతు సగంవరకు కోయబడింది. నెత్తురుతో ఆప్రాంత మంతా తడితడిగావుంది. జుట్టు చిందరవందరగా రేగి కొంతా, నెత్తురులో తడిసి, నేలకుఅంటుకుపోయికొంతావున్నది. నాలుక పళ్ళమధ్యగుండా భయంకరంగా వెళ్ళుకొచ్చింది. కళ్ళను అప్పటికే చీమలు పీక్కుతింటున్నాయి. కొందరు కేరళం గదిలో కెళ్ళారు. అతనికి దాపులోనే వాకకొడవలి నెత్తురుతో తడిసి పడివుంది. అతనిపొట్ట బద్దలుగా చీల్చబడివుంది. పేగులు వికృతంగా బైటికి తోసుకొచ్చాయి. రక్తంతో ఆ పరిసర మంతా చెక్కుగడుతున్నది.

"పాపం!" అని నిట్టూర్పు విడిచారు.

"దిక్కులేని చావు చచ్చారు"అని సానుభూతి చూపించారు.

కానీ ఆ చావులకు కారణాలేమిటో ఎవ్వరూ శ్రద్ధగా పరికించలేదు. కేరళం ఎందుకు చనిపొయ్యాడు? అతను ఆత్మ హత్య చేసుకొన్నాడా? లేక, హత్య చెయ్యబడ్డాడా? ఆత్మ హత్యే ఐతే, దానివల్ల ఏమి సాధించా లనుకొన్నాడు? హత్య చెయ్యబడితే హంతకునియొక్క—లేక- హంతకియొక్క- ఉద్దేశ్య మేమిటి? కేరళం భార్య ఎందుకు చనిపోయింది? ఇది ఆత్మ హత్యా లేక హత్య చెయ్యబడటమా? ఎందుకు చనిపోయింది! లేదా ఎందుకు హత్య చెయ్యబడింది? ఇత్యాది వేలాదిప్రశ్నలు ప్రశ్నలుగానే వుండిపొయ్యాయి. కానీ ఆప్రశ్నలతాలూకు వ్యక్తులుమాత్రం దాటిపొయ్యారు.

—०—